# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నూతన కేంద్ర మంత్రిమండలి మొదటి సమావేశం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసంలో ప్రారంభమైంది.
- ❖ భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.
- ❖ నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.
- ❖ కృష్ణా జిల్లా కేసరపల్లిలో జరుగుతున్న ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార ఏర్పాట్లను కార్యక్రమ రాష్ట్ర సమన్వయ అధికారి పి.ఎస్. ప్రద్యుమ్న ఈరోజు పరిశీలించారు.

========================

ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్రమోదీకి ప్రధానమంత్రి కార్యాలయ (పీఎంఓ) సిబ్బంది స్వాగతం పాలికారు. అనంతరం ప్రదాని, పీఎంఓ సిబ్బందితో మాట్లాడుతూ, ప్రధానమంత్రి కార్యాలయం ప్రజలకు మంరిత చేరువకాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా నూతన కేంద్రమంత్రి మండలి మొదటి సమావేశం ప్రధాని నివాసంలో కాసేపటి క్రితం ప్రారంభమైంది. ఈ సమావేశంలో రాబోయే వంద రోజుల కార్యాచరణను మంత్రులకు ప్రధాని దిశానిర్ధేశం చేస్తారు.

========================

భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీ సౌత్ బ్లాక్‌లోని ప్రధాన మంత్రి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీమ్ కిసాన్ ) 17వ విడత నిధుల విడుదల దస్త్రంపై తొలిసంతకం చేశారు. 2 వేల రూపాయల చొప్పున 9.3 కోట్లమంది రైతులకు 20వేల కోట్ల రూపాయల ఆర్ధిక సహాయం అందనుంది. ఈ సందర్బంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో రైతుల సంక్షేమంపై మరింత దృష్టి సారిస్తుందని ప్రధాని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఏర్పాట్లను 11వ తేదీ సాయంత్రం లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ రాష్ట్ర సమన్వయ అధికారి పి.ఎస్. ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధ టవర్స్ సమీపంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రధాన వేదిక వద్ద అధికారులతో కలసి ఏర్పాట్లను ఈరోజు పరిశీలించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర పోలీస్ అధికారులు, కృష్ణా జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ... ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు హాజరావుతారని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలకు, మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల పడవచ్చని, ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చి దిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విజ్ఞప్తి చేశారు. ఈరోజు ఆమె క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న కారణంగా, కాలుష్య నియంత్రణకు వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జివిఎంసి అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారని వివరించారు. ఇకో-వైజాగ్ అభివృద్ధిలో భాగంగా విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు కాలుష్య నియంత్రణకు జివిఎంసి అనేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని మేయర్ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకాశం జిల్లా గిద్దలూరులో ఈరోజు జరిగిన విద్యుత్ఘాతం ప్రమాదంలో ఇద్దరు మరణించారు. ఓ శుభకార్యానికి సప్లయర్స్ సామాన్లు తరలించి వాహనంలో తిరిగి తీసుకువస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ నీటి మోటార్ వైర్లు తగిలి విద్యుత్ సరఫరా కావడంతో వాహనంలో ఉన్న అన్నదమ్ములు శీలం లోహిత్, శీలం సాయి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరావతి రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో 673 ఎకరాల విస్తీర్ణంలో ముళ్ళ చెట్లను అధికారులు తొలగిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమరావతి ప్రాంతంలో జరుగుతున్న ఈ పనులను సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఈరోజు పరిశీలించారు. అనంతరం ఈ పనులకి సంభందించిన వివరాలను ఆయన తెలియజేస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

========================

పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండటాని దోమల నివారణ ఆవశ్యమని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఈరోజు కలెక్టర్ క్యార్యాలయంలో దృశ్య మాధ్యమం ద్వారా వివిధ మండల తహసీల్దార్లు, ఎంపీడిఓలు, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, గ్రామాలు పట్టణాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమం, తాగునీటి సమస్యలు, జల్ జీవన్ మిషన్ లో కొనసాగుతున్న పనులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. మలేరియా దోమల వ్యాప్తి నివారణకు పిచికారీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

========================

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, అనకాపల్లిలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారిని జనసేన అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ ఈరోజు దర్శించుకున్నారు. అధికారంలోకి వస్తే నూకాంబికా అమ్మవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకుంటానని ఎన్నికల ప్రచారంలో చెప్పిన పవన్ కళ్యాణ్ ఈరోజు ఆ మొక్కు తీర్చుకున్నారు. ఆయనతో పాటు ఇటీవల ఎన్నికైన అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

========================

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన పథకాన్ని యువత వినియోగించుకోవాలని గుంటూరు జిల్లా శిక్షణాసంస్థ సహాయ సంచాలకులు డి.వరప్రసాద్ కోరారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా శిక్షణ పొందిన 15 నుండి 20 సంవత్సరాలలోపు వారికి ప్రభుత్వమే ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తుందని తెలియజేశారు.

========================

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ముగిసింది. ఈరోజు ఢిల్లీ నుంచి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు నాయుడుకి తెలుగుదేశం పార్టీ పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు.

========================

సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జులై 27 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్, సెక్రెటరీ యం.బబిత తెలిపారు. కక్షిదారులకు అవసరమైన సహాయాన్ని అందజేయడానికి ఉన్నత న్యాయస్థానం, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. మరిన్ని వివరాల కోసం కక్షిదారులు లేదా వారి న్యాయవాదులు టోల్ ఫ్రీ నెం.15100కు ఫోన్ చేయవచ్చని లేదా వారి సమీప కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఆమె వెల్లడించారు.

=========================

ఆగ్నేయరైల్వే పరిధిలోని చక్రధర్పూర్ డివిజన్ లో భద్రతాపరమైన అభివృద్ధి పనుల కారణంగా ఈనెల 12వ తేదీన పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ రైల్వే సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వీటిలో రూర్కెలా నుంచి బయలుదేరే రూర్కెలా - జగదల్పూర్ ఇంటర్సిటీ ఎక్స్ ప్రెస్, రూర్కెలా - గుణుపూర్ రాజా రాణి ఎక్స్ ప్రెస్, జగదల్పూర్ నుంచి బయలుదేరే జగదల్పూర్ - రూర్కెలా ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ జత రైలు, గుణుపూర్ నుంచి బయలుదేరే గుణుపూర్ - రూర్కెలా రాజారాణి ఎక్స్ ప్రెస్ జత రైళ్లను రద్దు చేశారు. అలాగే విశాఖపట్నం నుంచి తెల్లవారుజామున 4 గంటల 20 నిమిషాలకు బయలుదేరే విశాఖపట్నం - బెనారస్ ఎక్స్ ప్రెస్ ను ఉదయం 7 గంటల 5 నిమిషాలకు రీషెడ్యూల్ చేశారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

=========================

=========================